# దొరలు

బా. సా.

తెల్ల దొరగారూ, తెల్లదొరసానమ్మ గారూ, వారిపిల్లలూ మనదేశం విడిచి వారిదేశం వెళ్ళిపోయారు.

నల్ల దొర గారూ, నల్లదొరసానమ్మ గారూ, వారిపిల్లలూ కారులో బంగాళా పోర్టికోలోకి వచ్చిపడ్డారు. పోర్టికోలో ఆరేడు కారులు ఆగొచ్చు. అంతపెద్దది, దాని నాలుగు మూలలనుంచి నాలుగు రకాల రాక్షసి తీగలు పోర్టికోఅంతానిండి, బంగాళాపైన సగం వెనకవరకూ విస్తరించి ఉన్నాయి.

పేద్దా బంగాళా. బంగాళాచుట్టు చెరువంత తోట – తోటచుట్టూ చుట్టబెడుతూ ఆరడుగుల ఎత్తు ప్రహారీగోడ.

పసందైన బంగాళాని, స్వయంగా తానే పెంచి పోషించిన ప్రశస్తమైన పువ్వులతోటని వదలిపెట్టి తెల్లదొరగారూ దేశం వెళ్ళిపోయారు.

తెల్లదొరగారి ఉద్యోగం నల్లదొరగారి ఉద్యోగం ఒక్కటే? కొండంత షోదా గల ఉద్యోగం. తెల్లతోలుపోయి నల్ల తోలు వచ్చింది,


తోటనిండా పువ్వులు నిండుగా ఉండేవి. వొక సీజను పువ్వుల మొక్కలు చచ్చిపోయేసరికి తరువాత సీజను పువ్వుల మొక్కలు పువ్వులతో కళకళ్ళాడుతూ వాటి పక్కనే పెరిగి ఉండేవి. వెల్తి కనబడకండా సంవత్సరం పొడుగునా పువ్వుల తోటంతా గంటలు మోగిస్తున్నట్టు ఏరోజూ పూసి ఉండేవి.

నల్ల దొరగారొచ్చిన కొద్దిరోజులకి నా మనస్సు చివుక్కుమంది. నల్లదొరగారు తోటమాలిని మానిపించేశారు. పాతికేళ్ళాయి మాతోపాటు తోటపని చేస్తూ బంగళాలో పడివుండేవాడు. తోటమాలి మాకక్కర లేదన్నారు నల్లదొరగారూ నల్లదొరసానమ్మగారూ!

పొద్దున్నే వొరోజు తోటమాలి చేతులు జోడించుకొని దొరగారి ఎదుట నిలబడ్డాడు.

"చిన్నప్పటినుంచి బంగళాలో ఉన్నానండి. నాకు తెలియని తోటపని లేదు. కటాక్షించాలి" అని మొరపెట్టుకున్నాడు.

"నీ గురించి వాళ్ళకి చెప్పేనే" అన్నారు దొరగారు. ఏమిటి చెప్పేరు? తోటమాలి ఇంక రానక్కరలేదని.



"నువ్వు వెళ్ళు, కావలిస్తే నేనేకబురు పంపుతాను" అన్నారు. వాణ్ణిమరి పిలవ లేదు. ఉసూరుమని ఎటుపోయాడో పోయాడు.


తెల్ల దొరగారు తోటమాలికి వాళ్ళ ఆఫీసు గుమస్తాలకన్న, ఎక్కువ జీతం ఇచ్చేవారు! నల్లదొరగారు ఇస్తారా!

"ఎందుకొచ్చిన తోటమాలి? వాడి మొహం ఏమిటి చేస్తాడు? క్రోటన్సు మొక్కలు, పిచ్చిపిచ్చి పువ్వుల మొక్కలు. పువ్వులు తల్లోపెట్టుకోడానికి పనికిరావు. దేముడిపూజకు పనికిరావు!" అన్నాది నల్లదొరసానమ్మ.

"కూరలు పండిస్తాడు!" అన్నారు దొరగారు.

"వెధవ కూరలు. వాడికిచ్చే జీతంలో నాలుగోవంతు పెడితే నెలకి సరిపడా కూరలు మనకి రావూ?" అన్నారావిడ. తోటమాలిపని అయిపోయింది. అడుగు వాళ్ళ బతుకులు అంతే.

నల్ల దొరసానమ్మని చూస్తే వొళ్ళు మండిపోతూ వొచ్చింది. వాళ్ళు వచ్చిన కొద్దిరోజుల్లో ఆవిడ చేసిన పనికి నాకు




పరమ అసహ్యం వేసింది.

పోర్టికోకి ఎడంపక్కగా ఉన్న స్థలం దొరగారు లాండ్రీవాడికి అద్దెకిచ్చారా అన్నట్లు తయారైంది. నాలుగు వెదుళ్ళు పాతించి పొడుగ్గా ఇనపతీగ కట్టి ఇంటిల్లిపాది బట్టలు ఆరెయ్యడం మొదలుపెట్టేరు. దాని పక్కనే మరోతీగ కట్టి చంటిపిల్లల బట్టలు మరోతోరణం ఆరవేసేవారు. రోడ్డుకెదురుగా పోర్టికోకి పక్కగా! లాండ్రీవాడి ఆతాలాగుండేది. నిత్యం బంగళాకి కట్టిన తోరణాలలాగ ఉండేది. నాకు వొళ్ళుమండిపోయి దొరసానమ్మగారితో అన్నాను.

"అమ్మా! వెనకటి దొరలు బట్టలు వెనక పెరట్లో ఆరేసుకొనేవారు. తమరు ముందు ఆరేస్తున్నారు. బంగళాకి వెనకైతే బాగుంటుందికదా?" అన్నాను. అవిడ చర్రునలేచి "ఆ బట్టల్లో వోచీర పోతే డబ్బు నువ్వు ఇచ్చుకుంటావా?" అన్నది.

"చిత్తం చిత్తం చిత్తం! తమరు చెప్పిందే నిజం పెరట్లో బట్టలు ఆరేస్తే పోవచ్చు. తెలియక పెద్ద ఆలోచన లేనివాణ్ణి" అన్నాను.

"పెరట్లో చూడు. గోడ ఇటికలు పీకేసి గుంటవెధవలు పెరట్లోకి వచ్చేస్తున్నారు" అన్నాది.

"నిజమే తల్లీ నిజమే" అన్నాను. నిజమే గోడవతల కొంపల్లో పిల్లలు గోడ ఇటికలు సగానికి తీసేసి తోటలోకి దిగిపోతున్నారు. సీమచింతకాయలు రాళ్ళతో రాలగొట్టి తింటున్నారు.

తెల్లదొరగారున్నప్పుడు. తోటలోకి ఎవడైనా తొంగి చూసేవాడా? వారి పిల్లలు తోటంతా ఆడుతూ గెంతుతూ ఉండేవారు. వారి అల్సేషియను కుక్కలు అడవిలో తోడేళ్ళలాగ తోటంతా తిరుగుతూ ఉండేవి.

నల్లదొరగారు కాస్త కన్నెర్రచేస్తే అంతాకనై పోతుంది. పెరటి పక్కవారు చూడ్డమేలేదు.

అంచేత కొద్దిరోజుల్లోనే గోడ నేలమట్టానికి వొచ్చేసింది. అందులోంచి పశువులు, పందులు, గాడిదలు దొడ్డిలో ప్రవేశించి కొద్దిరోజుల్లో దొడ్డంతా సర్వనాశనం చేసేశాయి. ఇదంతా దొరగారి కంట పడ్డంలేదా? మనకున్న కళ్ళు వారికిలేవా?

ఆ జంతువులు తోటంతా విహరిస్తూ పోర్టికో పక్కనుంచి వచ్చి ఇన్ గేటులోంచి రోడ్డుమీదికి పోయేవి. పశువులకి పందులకి ఇన్‌గేటులోంచి వెళ్ళకూడదని తెలుస్తుందా?

ఇదే బంగాళాకి ఎవరెవరో వచ్చేవారు. హేమాహేమీలు, ఎమ్పీలు, ఎమ్మెల్లేలు. భూస్వాములు, వ్యాపారస్తులు, చదువుకొన్నవుళ్ళో పెద్దలు తెల్లారే సరికి వచ్చి పడేవారు,

గుమస్తాల్లో గుసగుసలు వినబడుతూనే ఉండేవి. ఓ నాడు నల్లదొరగారు చాలా అగ్గజమైన మొత్తం ఒక వ్యవహారంలో పుచ్చుకున్నారని గుమస్తాలు తేల్చేశారు.

అనాడు తెల్లదొర తక్కువ తిన్నాడా? సంచులకి సంచులు దొచుకు పోయాడు. పెద్ద పెద్ద పార్టీలు తరచు ఇచ్చేవాడు. ఎక్కడలేని దొరలు, దొరసానులుకారుల్లో ఈనీసేవారు. బంగళా వెనక హాల్లో సంగీతాలు పెట్టుకుని తాగి, తిని, గెంతి గోలగోల చేస్తూ సరదాలు చేసేవారు. దొరలకి డబ్బు బాగా కావాలి. తెల్లవాళ్ళైనా, నల్లవాళ్ళైనా వాళ్ళకి డబ్బూ డానంతట వొచ్చి పడుతూనూ ఉంటుంది.

నల్ల దొరగారు మూడేళ్ళు ఓ ఏలుబడి ఏలేశారు. బదిలీ అయిపోయింది. ఊళ్ళో పెద్దలు పెద్ద మీటింగు పెట్టేసి, తెగ దండలు వేసేసి, తెగ పొగిడేసి నల్ల దొరగారిని మరోవూరు పంపించారు.

మరో నల్లదొరగారు ఇంక దిగుతారు. ఎవరు దిగితే ఏముంది? దొరలు దొరలే.

♦♦♦


## ఎంట్రీఫీజు లేకుండా లక్షరూపాయల విలువగల బహుమతులు గెలుపొందండి

మొదటి బహుమతి రాజదూత్ మోటర్ సైకిల్. ఇదిగాక నూటఒక్క కన్సొలేషన్ బహుమతులు కలర్ టి.వి.లు గొలుసుపద్ధతిద్వారా జపాన్ మోడల్ సోనీ హైఫై టు-ఇన్-వన్ గెలుపొందండి.

పోస్ట్‌కార్డ్‌పై తొమ్మిది చదరాలను గీసి వాటిలో 11 నుండి 19 వరకు సంఖ్యలను ఉపయోగించి ఎటుకూడినా మొత్తం 45 వచ్చేటట్లు చేయండి. ఒక సంఖ్యను ఒకసారి మాత్రమే ఉపయోగించాలి. మీ [illegible]ను 15 రోజుల్లోగా పంపండి. మాకు చేరిన మొదటి పది ఎంట్రీలకు చేతి గడియారం ఉచిత బహుమతి.

SAMRAT SALES ( 45 JH)

Post Box No. 7174, NEW DELHI- 110 002